

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

### (కిందటి సంచికనుండి కొనసాగింపు)

**చూస్తూ చూస్తూ సెలవలు** అయిపోయి తిరిగి వెళ్ళాల్సిన రోజు వచ్చింది. ఎప్పటిలానే దిగులు మొదలైంది. అన్నయ్య దగ్గరే ఉండి చదువుకుంటే ఎంత బావుండేదో ఇప్పుడు వారం మించి అన్నయ్య దగ్గర ఉండలేని పరిస్థితి. కదిలిస్తే ఏడ్చేలా ఉంది నా పరిస్థితి. దాంతో ఉదయం అమ్మతో ఫోన్‌లో ఎక్కువ మాట్లాడలేదు. అన్నయ్యని కుడా కొంత దూరంగా పెట్టాను. అర్థం చేసుకుని ఎక్కువగా నన్ను కదిలించలేదు.

"న్యూ ఇయర్ రెసల్యూషన్స్ ఏ మైనా తీసుకున్నావా?" అడిగాడు.

తల అడ్డంగా ఊపాను.

"రోజూ కొంత సేపు యోగా చెయ్యి. మీ యూనివర్సిటీలో క్లాసెస్ ఉన్నాయేమో కనుక్కో. రోజూ కొంతసేపు యోగా చేస్తే వయసు పెరిగే కొద్ది వచ్చే రోగాలు తగ్గుతాయి. నీ ఏజ్ నించి చెయ్యడం సులభం."

తలాడిచ్చాను. ఆ రెండు ముక్కలు తప్ప మా మధ్య ఏ సంభాషణ జరగలేదు. ఎయిర్‌పోర్ట్ చేరాక ఏడుపు ఆగలేదు. మొదటిసారి స్కూల్‌కి వెళ్ళే పిల్లలా ఎంతో ఏడ్చాను. సెక్యూరిటి చెక్ వాళ్ళు నన్ను చూసి కాస్త జాలిపడినట్టు అనిపించింది. గేటు దగ్గరకి వెళ్ళాక నా ఏడుపు, దిగులు మాయమయ్యేట్టు యూనివర్సిటి క్లాస్ గ్రూప్ చాట్‌లో అందరూ కొత్త సెమిస్టర్ గురించి, క్లాసులు, ప్రాజెక్ట్‌ల గురించి మాట్లాడడం మొదలు పెట్టారు. దాంతో దిగులు నుండి రియాలిటీలోకి వచ్చాను. వాళ్ళంతా ఇంతగా ప్లాన్ చేసుకోవడం చూసి కాస్త దడపుట్టింది. ప్రొఫెసర్‌తో ఈ సంగతి గురించి చెపుదామని మరుసటి రోజు సాయంత్రం మూడింటికి అపాయింట్ మెంట్ తీసుకున్నాను. ఇంతలో వెన్నెల ఫోన్ చేసింది.

"నా పేరు వెన్నెల అండి. ఎలా ఉన్నారు?" అడిగింది.

"వెన్నెల, నేను అవనిని" ఎవరికో బదులు నాకు చేసిందనుకున్నాను.

"ఓ, నేను గుర్తున్నాను రోయ్" వెటకారంగా అంది.

"అదే మరి. ఎలా మర్చిపోతా?"

"న్యూ ఇయర్‌కి విష్ కూడా చెయ్యలేదు నువ్వు. వెళ్ళినప్పటినుండి అత్తా పత్తా లేకుండా పోయావు."

"బిజీగా ఉండి మర్చిపోయాను."

"సరే కానీ, నీ ఫ్లైట్ డిటెయిల్స్ ఇవ్వు. వచ్చి పిక్ చేసుకుంటా. ఇవాళే కదా?"

"అవును. ఎయిర్పోర్ట్‌లో ఉన్నాను."

"ఔనా? నయం ఫోన్ చేసాను. నాకు ఎందుకు మెసేజ్ చెయ్యలేదు?"

"అంటే నువ్వు బిజీ ఏమో అని."

"మరీ అంత మొహమాటం పనికి రాదు పాప. సరే, ఫ్లైట్ నంబర్ మెసేజ్ చెయ్యి నేను వస్తా.""

"హనీష కూడా వస్తుందా?

"లేదు తను రాలేని పరిస్థితి"

"అదేంటి?"

"అది చెపితే అర్థంకాదు. చూస్తేనే అర్థం అవుతుంది."

"అయ్యో, ఏమైంది?"

"ఏం కాలేదు. కాస్త దయ్యంలా ఉంది ప్రస్తుతానికి. నువ్వు వచ్చాక చెప్తాలే."

"సరే అయితే బై" ఫోన్ పెట్టి ఏమయ్యుంటుందా అని కాసేపు ఆలోచించాను.

ఫ్లైట్ బోర్డింగ్ మొదలైంది. ఎక్కిన వెంటనే నిద్రలోకి జారుకున్నాను. ఫ్లైట్‌లో వచ్చిన అనౌన్స్‌మెంట్లు ఏమీ నా చెవిన పడలేదు. లాండ్ అయినప్పుడు ఆ అలజడికి లేచి ఆశ్చర్యపోయాను. అంత అలసిపోయానని నాకు తెలియలేదు.

దిగగానే అన్నయ్యకి చేరానని మెసేజ్ పంపి వెన్నెలకి ఫోన్ చేసాను. ఫ్లైట్ త్వరగా లాండ్ అవ్వడంతో కొద్దిసేపు వెన్నెల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. ఈలోగా హనీషకి వాట్సాప్‌లో 'ఎలా ఉన్నావు? అంతా ఓకేనా?' అని మెసేజ్ పంపాను. తను చూసింది కానీ బదులు పంపలేదు. వెన్నెల రాగానే ముందుగా హనీష గురించి అడిగాను. వెన్నెల పెద్దగా నవ్వి 'నువ్వు ఫోటోస్ చూడలేదా?' అని అడిగింది.

'లేదు ఏం ఫోటోస్?' తిరిగి అడిగాను.

'నిన్న పార్టీవి ఇన్‌స్టాగ్రాంలో ఉన్నాయి' అంది.

ఫోన్ బాటరీ తక్కువ ఉండటంతో ఇంటికి వెళ్ళాక చూద్దాం అనుకున్నాను.

"ఏమైంది ఇంతకి?" అడిగాను.

"హనీష పాపం జుట్టుకి రంగు వేసుకోవాలనుకుంది. కానీ బ్యూటీ పార్లర్‌లో చాలా ఎక్కువ అని ఇంట్లోనే వేసుకుంది" పెద్దగా నవ్వింది.

"సరిగ్గా రాలేదా? లేదా పిచ్చి కలరా? "

'కలర్ మంచిదే. మీడియం బ్రౌన్. కలర్ సరిగ్గానే ఉంది" మళ్ళీ కాసేపు నవ్వింది.

"మరి ఏమైంది?" అడిగాను.

"అమ్మగారు స్టైలిష్‌గా ఉంటుందని రూట్ టచప్‌లాగ కలర్ వేసుకున్నారు."

"బాలేదా బ్లాక్ అండ్ బ్రౌన్?"

కొద్దిసేపు నవ్వి "అది ఇంట్లోనే వేసుకుంది యూ ట్యూబ్ వీడియో చూస్తూ. అదికూడా రాత్రి. తల స్నానం చేసేసరికి దాదాపు టెన్ అయ్యింది" మళ్ళీ నవ్వింది.

"సరిగ్గా పోలేదా కలర్?"

"కలర్ పోయింది కాని బానే అంటింది" మళ్ళీ నవ్వింది.

"సరిగ్గా చెప్పు. ఏమైంది? రాత్రి వేసుకుంటే ఏం?"

"రాత్రి జుట్టు తడిగా ఉండి అంతా డార్క్‌గా ఉంది. సరిగ్గా కలర్ తెలీలేదు" మళ్ళీ నవ్వు.

"సెట్ అవ్వలేదా కలర్?"

"కొన్ని చోట్ల రూట్లు కాకుండా తలపైన ఉన్న జుట్టుకి కలర్ అంటింది. బ్రౌన్ అవ్వడంతో క్లియర్‌గా తెలుస్తుంది. అది కూడా ఎండలోకి వెళితే "కాస్త నవ్వి" ఇంకా బాగా కనిపిస్తుంది" మళ్ళీ నవ్వు.

"నాకు ఇంకా అర్థంకాలేదు."

"తలపైన పాచ్‌లు బ్రౌన్, మిగిలింది బ్లాక్. పాపం అలానే పార్టీకి వెళ్ళింది. అందరూ ఫోటోస్ ఇన్‌స్టాగ్రాంలో పెట్టారు. చూడ్డానికి ఏదో చర్మవ్యాధివల్ల జుట్టు రంగు మారినట్టు ఉంది" పెద్దగా నవ్వింది.

వెన్నెల ఫోన్ తీసుకుని ఆ ఫొటోలు చూసాను. నిజంగానే నడినెత్తిన అక్కడక్కడా బ్రౌన్, అక్కడక్కడా బ్లాక్ ఉండి భలే విచిత్రంగా ఉంది. ఇద్దరం నవ్వుతూ ఇంట్లోకి వెళ్ళాము. హనీష టోపీ పెట్టుకుని కాఫీ తాగుతూ బయట కూర్చుంది. తనని చూసి ఇంకా నవ్వాము.

"ఎందుకు నవ్వుతున్నారు?" కుతూహలంగా అడిగింది.

మా నవ్వు పెరగడంతో తనని చూసి అని అర్థమై లోపలికి కోపంగా వెళ్ళింది. కానీ తను టోపీ తీనప్పుడు ఆ రంగు రంగుల జుట్టు చూసి కాస్త భయం కలిగింది. ఆ తరవాత జాలేసింది. రేపటినుండి క్లాసులు కూడా మొదలు పాపం.

"అయ్యో, ఇప్పుడెలా?" అడిగాను.

"గూగుల్ చేసాను. కలర్ కరెక్టర్ వాడాలన్నారు కానీ అది ఎలా పనిచేస్తుందో తెలీక బ్లాక్ కలర్ తెచ్చాను"

"ఇప్పుడు ఆ జుట్టుకి బ్లాక్ వేస్తావా?"

"వెన్నెలని వెయ్యమన్నాను. నిన్న చేసిన ఘనకార్యానికి నాకు ఇంక రంగంటేనే భయం పుట్టింది."

నేను వెన్నెల నవ్వాము.

"మరి ఎలా?" అడిగాను.

"నువ్వూ, వెన్నల వెయ్యండి బ్లాక్ కలర్" అంది

"మా అమ్మ వేసుకునేప్పుడు చూడ్డం తప్ప ఎప్పుడూ రంగు కలపను కూడా కలపలేదు" అన్నాను.

తను కాస్త బతిమిలాడాక ఇద్దరం  దువ్వెనతో తీస్తే కొద్ది పాచ్‌లు కనపడ్డాయి. నేను గోడకి రంగు వేసినట్టు, వెన్నెల పేపర్ మీద గీసినట్టు రంగు వెయ్యడం మొదలు పెట్టాము. నేను కుడిభాగాన్ని, వెన్నెల ఎడమ భాగాన్ని పంచుకుని పోటీపడ్డాము. నిన్న జరిగిన దానివల్ల ఇవాళ హనీష జుట్టుని డ్రై చేసి, తలమీద టార్చ్ లైట్ వేసి అంతా బ్లాక్‌గా ఉందా లేదా అని చెక్ చేసింది. ఆ తరవాత తనుకూడా మాతో కలిసి చాలాసేపు నవ్వింది. ఎయిర్ పోర్ట్‌లో పడిన దిగులంతా మటుమాయం.

మర్నాడు ఉదయం లేచి లాబ్‌కి వెళ్ళాను. నేను, రెయిన్ చాలాసేపు కబుర్లు చెప్పుకుంటూ ప్రొఫెసర్ రావడం గమనించలేదు. న్యూ ఇయర్‌కి మేం చేసిన పనులు చెబుతుంటే ఆయన కూడా మా సంభాషణలో చేరారు. మొదట్లో ఆయన వెటకారంగా మాట్లడుతున్నారని భయపడి సారీ చెప్పాను. 'వై?' అని ఆయన నవ్వడంతో స్నేహితుల్లా మాట్లాడాము. భలే కల్చర్ షాక్‌లా అనిపించింది. ఇదే ఇండియా అయితే పని చెయ్యకుండా  ఏంటి ముచ్చట్లు అని ప్రొఫెసర్ తిట్టేవారు. ఈ సెమిస్టర్ నా క్లాసులు మంగళవారం, బుధవారం, గురువారం కావడంతో ఇవాళ పెద్దగాఏమీ

చెయ్యలేదు. రెయిన్ కూడా నా బుధవారం క్లాసులో ఉండడంతో దాన్ని గురించి మాట్లాడాను. వాట్సఆప్ గ్రూపులో చాట్ చూసి నేను భయపడిన సంగతి చెబితే తనుకూడా భయపడ్డానని చెప్పింది. దాంతో నాకు కాస్త ధైర్యంగా అనిపించింది. ఇంతలో అభిషేక్ రావడంతో క్లాసుల గురించి, హాలీడే గురించి మరింతసేపు మాట్లాడాను. తను ఇండియాకి వెళ్ళి రావడం వల్ల కాజు బర్ఫీని తెచ్చానని మా ఇద్దరికి తలా ఓ ముక్క పెట్టాడు. తను వెళ్ళిపోయాక నేను, రెయిన్ ఇంకా కొన్ని ఇచ్చి వుండచ్చుగా కక్కుర్తి కాకపోతే అనుకున్నాము. ఈలోగా ప్రొఫెసర్‌తో మీటింగ్‌కి టైమంది. మర్నాడు కలుస్తా అని రెయిన్‌కి చెప్పి వెళ్ళిపోయాను.

ఆఫీసులోకి వెళ్ళగానే ప్రొఫెసర్ ముందు హాలిడేస్ ఎలా ఎంజాయ్ చేసావు, మీ అన్నయ్య ఏం చేస్తాడు అని మామూలుగా మాట్లాడారు. ఆ మాటల్లో వాట్సఆప్ గ్రూప్ సంగతి చెప్పి నేను ఆయనని ఎందుకు కలిసానో చెప్పాను. చిన్నగా నవ్వుతూ ఆ భయం మంచిదే అని, అయితే మరీ ఎక్కువగా చింతిచొద్దని చెప్పారు. నేను ఏ ఏ క్లాసులు తీసుకుంటున్నాను, ప్రాజెక్ట్ ఎంత వరకు వచ్చింది, అన్నీ చర్చించాము. ఆ తరవాత నన్ను ఒక ప్లాన్ తయారు చెయ్యమని కొన్ని గమనికలు ఇచ్చారు. అలానే ఈ సెమిస్టర్‌లో ఏ సబ్జెక్ట్‌కి ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుందో కూడా చెప్పారు. నేను ప్లాన్ తయారు చేసాక దాన్ని బట్టి సమయం ఉంటే మరో ప్రాజెక్ట్‌లో కూడా నేను పనిచెయ్యచ్చని, ఆ పేపర్ పబ్లిష్ అయ్యాక నాకు రెజ్యూమ్ లో పనికొస్తుందని చెప్పడంతో వెంటనే ఒప్పుకున్నాను.

తొందరలేదు, ఆలోచించు, మళ్ళీ వచ్చే వారం మాట్లాడదాం అన్నారు.

నిన్న ఎంత దిగులుగా, బాధగా, భయంగా ఉన్నానో ఇవాళ దానికి పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాను. వెన్నెల, హనీష, రెయిన్ మొదటి దానికి కారణమైతే ప్రొఫెసర్ ఆఖరిదానికి కారణం. జీవితం హాయిగా ఉంది అని అనుకునే లోపు రేపటి క్లాస్‌కి అవసరమైన టెక్స్ట్ బుక్ లైబ్రరీలో దొరకలేదు. దాంతో ఆకాశం నుండి మళ్ళీ నేలమీదకి వచ్చేసాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story